క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ

చిట్వేలి : చిట్వేలి ఎంపీడీఓగా శివరామిరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఖాజీపేట మండలంలో ఏఓగా పనిచేస్తూ పదోన్నతిపై చిట్వేలి ఎంపీడీఓగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

ఏపీఓగా సి.రామచంద్ర..

గాలివీడు : మండల ఏపీఓగా సి.రామచంద్ర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అనంతపురం జిల్లా కుందుర్పి మండల ఏపీఓగా విధులు నిర్వహిస్తూ బదిలీపై గాలివీడు వచ్చానని తెలిపారు. ఉపాధిహామీ పథకం ద్వారా జాబ్ కార్డ్ కలిగిన ప్రతి కూలీకి పని కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో ఉపాధి పనుల్లో ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు.

రోడ్డు పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ బాబుల్‌రెడ్డి

పుల్లంపేట : మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఎన్నో ఏళ్లుగా సిమెంట్ రోడ్డు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడేవారు. ఎట్టకేలకు 240 మీటర్లు సిమెంట్ రోడ్డు పనులకు సోమవారం ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి, కాంట్రాక్టర్ సుబ్బారెడ్డిలు పూజ చేసి ప్రారంభించారు. అలాగే పుల్లంపేటలోని స్మశానం ఆక్రమణకు గురికావడంతో గ్రామస్తులు కోరిక మేరకు జిల్లా పరిషత్ నిధులతో ప్రహరీ గోడకు వారు భూమిపూజ నిర్వహించారు. అనంతరం చిట్వేలి – పుల్లంపేట డబుల్ రోడ్డు పనులలో భాగంగా ఆక్రమణలు త్వరగా తీసివేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి, సుదర్శన్ రెడ్డి, నూకా శ్రీరాములు, బిట్టా శివరామయ్య, పంచాయతీ కార్యదర్శి పెంచలయ్య, పార్థసారథి, మడగలం శ్రీనివాసులు, పార్థసారథి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీఎస్‌కు న్యాక్ 'ఏ' అక్రిడిటేషన్



గుర్తింపు పత్రాన్ని అందజేస్తున్న గంగిరెడ్డి

రాజంపేట : ఏఐటీఎస్ అనుబంధ సంస్థ అయిన అన్నమాచార్య ఫార్మసీ కళాశాలకు నాక్(ఎన్ఏఏసీ) 'ఏ' అక్రిడిటేషన్ గుర్తింపు పొందిందని ఏఐటీఎస్ అధినేత చొప్పా గంగిరెడ్డి తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో గుర్తింపునకు సంబంధించిన పత్రాన్ని సిబ్బందికి అందజేశారు. ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్ స్వర్ణలత, కో-ఆర్డినేటర్ ద్వారకనాథరెడ్డిలు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ అర్జీలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీధర్ రావు

పెనగలూరు : ఆన్‌లైన్‌లో వచ్చిన స్పందన అర్జీలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీధర్ రావు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన ద్వారా, సచివాలయాలు ద్వారా వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. భూ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. వివిధ అంశాలపై ఆయన తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీ కొన్న ఆటో..

రైల్వేకోడూరు : కుక్కలదొడ్డి సమీపంలో సోమవారం సాయంత్రం ట్రాక్టర్ వెనుక వైపు ఆటో ఢీ కొన్న సంఘటనలో ఆటోలో ఉన్న ముగ్గురికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. వివరాలు.. కోడూరు నుంచి రేణిగుంట వైపు వెళ్తున్న ట్రాక్టర్ కుక్కలదొడ్డి సమీపంలోని బ్రిడ్జి వద్దకు రాగానే వెనుకవైపు అతివేగంగా వస్తున్న ఆటో ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. ఆటోలో ఉన్న ముగ్గురికి గాయాలవడంతో ప్రథమ చికిత్సకోసం రేణిగుంటకు తరలించినట్లు తెలిపారు.

అర్జీదారులకు అన్నదానం



రాయచోటి టౌన్ : అర్జీదారులకు ప్రతి సోమవారం చేస్తున్న అన్నదానం 25 వారానికి చేరుకుంది. సమస్యల పరిష్కారానికి జిల్లా నలుమూలల నుంచి కలెక్టరేట్ స్పందనకు వచ్చే ఈ సదుపాయాన్ని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా వాల్మీకి సంఘం అధ్యక్షులు గువ్వల బుజ్జిబాబు,తదితరులు పాల్గొన్నారు.

బడి తెరిచారు.. విద్యా కానుక అందించారు

- పాఠశాల ప్రారంభమైన మొదటి రోజే విద్యా కానుక అందజేత
- పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు



సంబేపల్లె: జగనన్న విద్యా కానుకను పంపిణీ చేస్తున విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు



రాజంపేట: విద్యా కానుకను అందజేస్తున్న ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి

సంబేపల్లె : జగనన్న విద్యా కానుక విద్యార్థులకు వరమని మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. సోమవారం సంబేపల్లె, దేవపట్ల జిల్లా పరిత్ ఉన్నత పాఠశాలలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబరంరెడ్డితో కలిసి జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ స్కూల్ పిల్లలను తలదన్నేలా ప్రభుత్వ విద్యార్థుల సైతం చదువులో రాణించేందుకు జగనన్న విద్యా కానుక తోడ్పడుతుందన్నారు. ఈ విద్యా కానుక కింద బడులు తెరిచిన రోజే ప్రతి విద్యార్థికి ఉచితంగా 3 జతలు యూనిఫాం, ఒక జత బూట్లు, స్కూల్ బ్యాగ్, బెల్ట్, బూట్లు, సాక్సులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం గ్రామానికి చెందిన గుండ్రె వెంకటరమణారెడ్డి, భువనేశ్వరరెడ్డిలు పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు వేణుగోపాల్‌రెడ్డి, రామచంద్ర, ప్రధానోపాధ్యాయలు నరసింహారెడ్డి, శ్రీనివాసులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మారనున్న ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు

చిన్నమండెం : రాష్ట్ర ప్రభుత్వం విద్యా శాఖకు కేటాయిస్తున్న నిధులతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోతున్నాయని ఎంపీడీఓ రహీం, ఎంఈఓ శివానాయక్‌లు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో విద్యార్థులకు జగనన్న కానుకల పంపిణీలో వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోనూ జగనన్న విద్యాకానుకలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సిద్దవటంలో..

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్థానిక సర్పంచ్ తుర్రా చిన్నక్క విద్యార్థినీ, విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మికేశమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతోనే పేదరికం లేని సమాజం

రాజంపేట టౌన్ : విద్యతోనే పేదరికం లేని సమాజం సాధ్యం అవుతుందని విశ్వసించిన ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గడికోట గుల్జార్ బాషా తెలిపారు. స్థానిక ఉర్దూ పాఠశాల విద్యార్థులకు సోమవారం మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సుమియా బేగంతో కలిసి జగనన్న కానుకను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుల్జార్‌బాషా మాట్లాడుతూ విద్యార్థులంతా ఉన్నత విద్య అభ్యసించాలన్నదే సీఎం ఆశయమన్నారు. అందువల్లే విద్యారంగానికి జగన్ పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రఘురామ్, పాఠశాల కో-ఆప్టెడ్ మెంబర్ సయ్యద్ ఇనాయతుల్లా, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ అబ్దుల్ మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాకానుక వరంలాంటిది

పెనగలూరు : విద్యాకానుక విద్యార్థులకు ఓ వరంలాంటిదని ఎంపీపీ సౌందర్య అన్నారు. సోమవారం ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ సహజ బ్లెస్సీ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యార్థులకు అవసరమయ్యే బ్యాగు, పుస్తకాలు, నోటుపుస్తకాలు, యూనిఫాం, బూట్లు తదితర విద్యా సామగ్రి అందించడం గొప్ప విషయమన్నారు. మండల వ్యాప్తంగా 4222 మంది విద్యార్థులకు విద్యాకిట్లను సోమవారం అందజేశారు.

విద్యా రంగానికి స్వర్ణయుగం

నందలూరు(రాజంపేట) : విద్యారంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో స్వర్ణయుగమని నందలూరు మండలాధ్యక్షుడు మేడా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం నాగిరెడ్డిపల్లె జిల్లాపరిషత్ హైస్కూల్‌లో జగనన్న విద్యా కానుక కార్యక్రమంలో భాగంగాలో బ్యాగులు, పుస్తకాలు, యూనిఫాంలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ కలిగిందన్నారు. కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లె అర్బన్ సర్పంచ్ జంబు సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు జీవీసుబ్బారెడ్డి, నడివీధి సుధాకర్, జిల్లా వక్ఫ్ బోర్డు సెక్రటరీ అమీర్, మండల కో-ఆప్షన్ సభ్యుడు కలీం, మండల ఉపాధ్యక్షుడు నాయనపల్లె అనుదీప్, బీసీ నాయకుడు తుమ్మల శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లె : 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన జగనన్న విద్యాకానుకను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు జగనన్న కిట్లను ఆయన అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రాజ్ కుమార్, కో-ఆప్షన్ నెంబర్ సయ్యద్ అమీర్, సర్పంచ్‌లు ప్రభాకర్ రెడ్డి, వెంకటనారాయణ రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వీరబల్లెలో..

వీరబల్లె (రాయచోటి టౌన్) : పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న లక్ష్యమని వీరబల్లె ఎంపీపీ గాలివీటి విజయ రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం జగనన్న విద్యాకానుక పంపిణీ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని జిల్లా ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మట్లి సర్పంచ్ నాగార్జునాచారి తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్టలో..

ఒంటిమిట్ట : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న జగనన్న విద్యాకానుక ఓ వరమని మండల వైస్ ఎంపీపీ గెడ్డం జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన ఒంటిమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యాకానుక పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు హాజరయ్యారు. విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సురేష్ కుమార్, తహసీల్దార్ మాధవీలత, ఎంపీడీఓ రెడ్డయ్య, ఎంఈఓ వెంకట సుబ్బయ్య, పాఠశాల కమిటీ చైర్మన్ అజ్మతుల్లా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట లక్ష్మమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదరికాన్ని జయించే ఆయుధం చదువే

గాలివీడు : పేదరికాన్ని జయించే ఆయుధం చదువేనని వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక పంపిణీలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ యువనాయకులు నిజాముద్దీన్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



రాయచోటి టౌన్: వీరబల్లెలో ఎంపీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి..



రాజంపేట టౌన్: ఉర్దూ పాఠశాలలో..



చిన్నమండెం: విద్యాకానుకను పంపిణీ చేస్తున్న దృశ్యం



లక్కిరెడ్డిపల్లె: కిట్లను అందజేసిన ఎంపీపీ సుదర్శన్ రెడ్డి

అక్రమ ఇంటి నిర్మాణాలను అడ్డుకోండి



అక్రమ నిర్మాణాలపై జేసీకి ఫిర్యాదు చేస్తున్న సీపీఐ నేతలు

రాయచోటి అర్బన్ : పీలేరు పట్టణం శివార్లలో ఉన్న నూనె విత్తుల కార్మాగారం భూముల్లో అక్రమంగా చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలపై వెంటనే విచారణ జరిపించి నిలిపివేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌కు సీపీఐ నేతలు విన్నవించారు. స్పందన కార్యక్రమంలో భాగంగా సీపీఐ జిల్లా కార్యదర్శి పిఎల్ నరసింహులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివలు జేసీని కలుసుకున్నారు. వారు మాట్లాడుతూ పీలేరు – తిరుపతి మార్గంలో నిర్మించిన శ్రీకృష్ణదేవరాయ నూనెవిత్తుల కార్మాగారం కోసం అప్పట్లో రైతులు ఒకరూపాయి డబ్బులు తీసుకోకుండా ఉచితంగా భూములను ఇచ్చారన్నారు. కొన్నేళ్లుగా కార్మాగారం మూతపడటంతో కొందరు సదరు భూముల్లో అక్రమంగా ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారన్నారు. సదరు నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపించి ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ వారు జేసీకి విన్నవించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు విశ్వనాథ నాయక్, ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి, ఏఐటీయూసీ నేతలు వెంకటేష్, రామచంద్రలు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలి



చిట్వేలి: ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

చిట్వేలి : బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని తహసీల్దార్ శిరీషా పేర్కొన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐసీడీఎస్ చిట్వేలి ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఎంపీపీ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు నినాదాలు చేస్తూ ప్లకార్డులు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎవరైతే 16 సంవత్సరాలలోపు పిల్లలను పనిలో పెట్టుకుంటారో వారిపై బాల కార్మిక నిషేధ చట్టం కింద చర్యలు తప్పవని హెచ్చరించారు. ఐసీడీఎస్ సీడీపీఓ రాజేశ్వరి మాట్లాడుతూ భావిభారత పౌరులను తీర్చిదిద్దే బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్, ఐసీడీఎస్ గ్రేడ్-1 సూపర్‌వైజర్ వసుంధర, జీఎంఎస్‌కే అమరావతి, స్వర్ణ, శారద, శోభ, అంగన్‌వాడీ కార్యకర్తలు, సుధామణి, శాంతి కుమారి, సుజాత, రాధాశ్యామల పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

లక్కిరెడ్డిపల్లె : బాల్య వివాహాలు నేరమని సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. సోమవారం స్థానిక విశ్వభారతి హైస్కూల్‌లో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం కొత్త చట్టం తెచ్చిందని ఆమె వివరించారు. బాలికలు తమను ఎవరైనా ఇబ్బంది పెడితే చైల్డ్ లైన్ 1098 నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాల్సన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దాద్బి, అరుణ కుమారి, అరుణాదేవి, వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మైనార్టీలకు అండగా జగనన్న ప్రభుత్వం



హమ్ సబ్ జగన్‌కే సాథ్ కరపత్రాలను ప్రదర్శిస్తున్న ముస్లిం, మైనార్టీ నేతలు

రాయచోటి అర్బన్ : మైనార్టీలకు జగనన్న ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటోందని జిల్లా వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్ అన్నారు. హమ్ సబ్ జగన్‌కే సాథ్ కార్యక్రమంలో సోమవారం ఆయన పట్టణంలోని మస్జిద్ ఈ ఇషాక్, మస్జీద్ ఈ బిలాల్‌లలో హర్ దిల్ మే వైఎస్ఆర్ - హమ్ సబ్ జగన్‌కే సాథ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముస్లింల అభ్యున్నతి కోసం నాడు వైఎస్ఆర్ నేడు జగన్ ఎంతో కృషి చేస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అన్నా సలీంతో పాటు పలువురు మైనార్టీ నేతలు పాల్గొన్నారు.

14న షిర్డీకి ఆర్టీసీ బస్సు సర్వీసు

రాయచోటి అర్బన్ : రాయచోటి నుంచి షిర్డీ పట్టణానికి ఈనెల 14న సూపర్ లగ్జరీ బస్సును నడుపుతున్నట్లు డిపో అసిస్టెంట్ మేనేజర్ సుబ్బమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. షిర్డీకి రాను పోను చార్జీలు పెద్దలకు రూ.4800లు, పిల్లలకు రూ.2500లుగా నిర్ణయించామన్నారు. బస్సు సర్వీసు షిర్డీతో పాటు తుల్జాపూర్, శనిసింగనాపూర్, పండరీపురం క్షేత్రాలకు వెళ్తుందన్నారు. షిర్డీకి ప్రయాణించదలచిన వారు తమను సంప్రదించి టికెట్లను రిజర్వు చేసుకోవాలంటూ కోరారు. అలాగే 17వ తేదీ బస్సు గోవాకు బయలుదేరుతుందన్నారు. నాలుగురోజుల టూర్‌కు గాను పెద్దలకు రూ.3500లు, పిల్లలకు రూ.2వేలు చొప్పున టికెట్ ఉంటుందన్నారు. జూలై 2న ప్రతి పౌర్ణమికి రాయచోటి నుంచి తిరువణ్ణామలై అల్ట్రా డీలక్స్ బస్సు సర్వీసును నడుపుతున్నామన్నారు. ఉదయం 4గంటలకు బయలుదేరే బస్సు కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ పుణ్యక్షేత్రాల సందర్శన, మరుసటిరోజు గిరి ప్రదర్శన తర్వాత తిరుగు ప్రయాణం ఉంటుందన్నారు. వివరాలకు డీఎంను, ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్‌లో సంప్రదించాలంటూ కోరారు.

గాలివీడు వాసికి డాక్టరేట్

గాలివీడు : మండల కేంద్రంలోని రవీంద్రనగర్‌కు చెందిన ఐ.సురేష్ నాయక్ డాక్టరేట్ పొందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఐ.శ్రీను నాయక్, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు సురేష్ నాయక్ సీడ్స్ అండ్ సైన్స్ విభాగంలో సోమవారం కర్ణాటక రాష్ట్రం ధార్‌వాడ్‌లో యూనివర్శిటీ ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్ స్నాతకోత్సవంలో గవర్నర్ తవర్ చాంద్ గెహ్లాట్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ప్రస్తుతం ఈయన మార్కాపురం ఎస్ఎస్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

'జగనన్నకు చెబుదాం'తో సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి సురేష్ కుమార్, హాజరైన అధికారులు

ఒంటిమిట్ట : ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫోన్ ద్వారా తెలిపేందుకు జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని మండల ప్రత్యేక అధికారి సురేష్ కుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని గంగపేరూరు గ్రామ సచివాయలంలో ఎంపీడీఓ రెడ్డయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి సురేష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గంగపేరూరు గ్రామ పంచాయతీలోని సమస్యల గురించి స్థానిక అధికారులను, ప్రజా ప్రతినిధులను, నాయకులను, ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా ప్రజా సమస్యలపై వినతులు వచ్చాయని సురేష్‌కుమార్ తెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న ఆకేపాటి

రాజంపేట రూరల్ : జ్ఞాన సరస్వతీదేవి దేవాలయ వార్షికోత్సవ వేడుకలను నిర్వాహకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని శేషమాంబపురం పంచాయతీ బాలిరెడ్డిగారిపల్లిలో నిర్వహించిన ఈ వేడుకలలో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆయన భక్తులకు అన్నప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్బరాయుడుతోపాటు వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సీఎంఆర్ఎఫ్ చెక్కులను జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి బాధితులకు అందజేశారు. ఆకేపాటి ఎస్టేట్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో సిద్దవటం మండలం మూలపల్లెకు చెందిన ముమ్మడి జయప్రదకు రూ. 60 వేలు, పెనగలూరు మండలం పొందలూరు గ్రామానికి చెందిన అచ్చమ్మకు రూ. 18 వేలు చెక్కులను అందజేశారు.

బదిలీపై వెళుతున్న రేంజర్‌కు సన్మానం



రేంజర్ ప్రసాద్‌ను సన్మానించిన సిబ్బంది

సిద్దవటం : సిద్దవటం రేంజర్ ప్రసాద్ బదిలీపై కడప రేంజికి వెళ్లడంతో ఆయనకు సిద్దవటం అటవీ అధికార సిబ్బంది సోమవారం సాయంత్రం శాలువా కప్పి పూలమాలతో సన్మానించారు. అంతకుముందు సిద్దవటం ఇన్‌చార్జి రేంజర్ బాధ్యతలను డిప్యూటీ రేంజర్ ఓబులేసు స్వీకరించారు. కార్యక్రమంలో ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ సురేష్, ఎఫ్‌బీఓ రాజశేఖర్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు బాగా చదవాలి.. రాణించాలి

- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ప్రారంభించిన ప్రభుత్వ విప్ కొరముట్ల, ముఖ్యమంత్రి సలహాదారు ధనుంజయ్‌రెడ్డి



పాఠశాలను ప్రారంభిస్తున్న కొరముట్ల శ్రీనివాసులు, ఆర్.ధనుంజయ్‌రెడ్డి, కొల్లం గంగిరెడ్డి, అధికారులు

ఓబులవారిపల్లె : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రపంచంతో పోరాడే విధంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం గాదెల పంచాయతీ తల్లెంవారిపల్లె నూతన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ముఖ్యమంత్రి సలహాదారు రక్కసి ధనుంజయ్‌రెడ్డి, సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి ప్రారంభించారు. ముందుగా తాత్కాలిక నూతన తరగతి గదులను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొరముట్ల మాట్లాడుతూ గాదెల అటవీ శివారు గ్రామాల విద్యార్థులకు ఉన్నత పాఠశాల ద్వార ఎంతో ప్రయోజనం కలుగుతుందని పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అన్నారు. విద్యార్థులు బాగా చదివి ప్రపంచ స్థాయిలో రాణించాలని సూచించారు. సీఎం సలహాదారు ధనుంజయ్‌రెడ్డి తాను చదువుకొన్న గ్రామాన్ని పాఠశాలను అభివృద్ధి చేసేందుకు ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. నియోజవర్గం వ్యాప్తంగా అభివృద్ధి పనులు మంజూరయ్యేలా ధనుంజయరెడ్డి కృషి చేయాలని కోరారు. అనంతరం రక్కసి ధనుంజయ్‌రెడ్డి మాట్లాడుతూ తాను చదువుకొనే రోజుల్లో గాదెల, జీవీపురం పంచాయతీల్లోని గ్రామాల విద్యార్థుల రోజూ ఓబులవారిపల్లెకు కాలినడకన, సైకిళ్లపై పాఠశాలకు వెళ్లేవాళ్లమన్నారు. అటవీ శివారు గ్రామాలలో పేద విద్యార్థుల ఎక్కువగా ఉన్నారని వారిని దృష్టిలో ఉంచుకొని ఉన్నత పాఠశాలను మంజూరు చేయించామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. పాఠశాల శాశ్వత భవన నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరయ్యాయని, అలానే కార్పొరేట్ కంపెనీల ద్వారా రూ. కోటి మంజూరు చేయించానని తెలిపారు. అనంతరం శారద ఫౌండేషన్ వారి ద్వార పాఠశాలకు చెందిన విద్యార్థినికి రూ.5 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు పంజం సుకుమార్‌రెడ్డి, ఏపీటీడీసీ డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి డిప్యూటీ డీఈఓ వరలక్ష్మి, జిల్లా టూరిజం డైరెక్టర్ జి.సుధాకర్‌రెడ్డి, రైల్వేకొడూరు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సీడీ నాగేంద్ర, తహసీల్దార్ పీర్‌మున్ని, సీనియర్ నాయకులు కొమ్మూరు భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రామకృష్ణయ్య, వక్ఫ్ బోర్డు జిల్లా డైరెక్టర్ సుంకేసుల రఫీ, సర్పంచ్‌లు కృష్ణయ్య, జయపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎంపీటీసీ నరసింహులు, దుర్గాప్రసాద్, నాయకులు కొమ్మూరు నారాయణరెడ్డి, కొమ్మూరు శంకర్‌రెడ్డి, రమేష్‌నాయుడు, గురివిరెడ్డి, కొలవల అమర్‌నాథ్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, ఆశోక్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, విజయ్, పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

హక్కుదారులకు జెడ్‌హెచ్‌డీసీ భూములు

చిన్నఓరంపాడు రెవెన్యూ పరిధిలోని జెడ్‌హెచ్‌డీసీ భూములు హక్కుదారులకు అందే విధంగా చర్యలు తీసుకుంటానని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో జెడ్‌హెచ్‌డీసీ భూములు ఇప్పించాలని చిన్నఓరంపాడు దళితవాడ గ్రామ ప్రజలు ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులును కోరారు. స్పందిచిన ఆయన ఎస్సీ కార్పొరేషన్ అధికారులతో ఈ విషయంపై మాట్లాడారు. సమస్య పరిష్కరానికి కృషి చేస్తామని అప్పటి వరకు భూముల్లోకి ఎవరిని రాణించవద్దని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా

రైల్వేకోడూరు : గ్రామీణ ప్రాంతాలకు నిరంతరం అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలనే ప్రధాన లక్ష్యంతో సబ్‌స్టేషన్‌ల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీలోని జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించనున్న 33 /11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఆయన సోమవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, ఏపీటీడీసీ డైరెక్టర్‌లు సాయికిషోర్‌రెడ్డి, మండల నాగేంద్రలు, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, జెట్పీటీసీ రత్నమ్మ, శివయ్య, తోట శివసాయి, ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, కాంట్రాక్టర్ యశ్వంత్ రెడ్డి, ఏడీ ధరణిరెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష

పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి అధ్యక్షతన సోమవారం సాయంత్రం ఉపాధి హామీ పథకం పనులు అమలు తీరుపై సర్పంచులు, ఉపాధి హామీ పనుల సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రభుత్వవిప్ కొరముట్ల హాజరయ్యారు. ఉపాధి హామీలో జరుగుతున్న పనులను విచారణ చేసి నివేదికలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నిరుపేదలు వలసలు పోకుండా నిరోధించేందుకు ఉపయోగపడే ఈ పథకం ప్రతి పేదవాడి ఇంటికి చేర్చాల్సిన బాధ్యత మనదేనని తెలిపారు. పథకాన్ని అవకతవకలు లేకుండా అమలు చేయాలని అదికారులకు, సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.